సాక్షి అనంతపురం

శుక్రవారం ၊ 28 ၊ ఫిబ్రవరి ၊ 2025



టన్ను చీనీ రూ.20,540

అనంతపురం మార్కెట్ యార్డులో గురువారం టన్ను చీనీకాయలు గరిష్టంగా రూ.20,540 ప్రకారం పలికాయి.



కిలో టమాట రూ.10

కక్కలపల్లి మండీలో గురువారం కిలో టమాట గరిష్టంగా రూ.10 ధర పలికింది. మార్కెట్‌కు 270 టన్నుల టమాట అమ్మకానికి వచ్చింది.

గరిష్టం/కనిష్టం
34.6°/ 14.9°

జిల్లాలో గురువారం ఉష్ణోగ్రతలు స్థిరంగా నమోదయ్యాయి. చలితీవ్రత తగ్గగా... ఎండలు క్రమంగా పెరుగుతున్నాయి. గంటకు 6 నుంచి 10 కి.మీ వేగంతో ఈశాన్యం దిశగా గాలి వీచింది.

న్యూస్‌రీల్

సరిహద్దుకు తుంగభద్ర జలాలు



సరిహద్దులో ప్రవహిస్తున్న తుంగభద్ర జలాలు

బొమ్మనహాళ్: హెచ్చెల్సీకి విడుదల చేసిన తుంగభద్ర జలాలు గురువారం బొమ్మనహాళ్ సమీపంలోని 105వ కిలోమీటర్ వద్దకు చేరుకున్నాయి. సాయంత్రానికి 600 క్యూసెక్కులు వస్తున్నట్లు హెచ్చెల్సీ అధికారులు తెలిపారు. ఇటీవల కేసీ కెనాల్ వాటాలో 0.5 టీఎంసీల నీటిని హెచ్చెల్సీకి విడుదల చేసిన విషయం తెలిసిందే. ఈ క్రమంలో నీటి ప్రవాహానికి ఇబ్బంది లేకుండా కాలువలో ముళ్ల కంపలను హెచ్చెల్సీ సిబ్బంది తొలగించారు.

రీసర్వే త్వరగా పూర్తి చేయండి



రీ సర్వే వివరాలను తెలుసుకుంటున్న జేసీ శివ్ నారాయణ్ శర్మ

గుత్తి రూరల్/యాడికి: రీసర్వే త్వరితగతిన పూర్తి చేయాలని జాయింట్ కలెక్టర్ శివ్ నారాయణ్‌శర్మ ఆదేశించారు. గుత్తి మండలంలోని శ్రీపురం, యాడికి మండలంలోని చందన లక్షుంపల్లి గ్రామంలో జరుగుతున్న భూముల రీ సర్వే ప్రక్రియను జేసీ గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే ప్రక్రియను నిష్పక్షపాతంగా చేపట్టాలన్నారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు రాకుండా చూడాలని చెప్పారు. రెవెన్యూ సదస్సుల్లో రైతులు ఇచ్చిన అర్జీలను త్వరగా పరిష్కరించాలని ఆదేశించారు. మండలంలో రీ సర్వే ప్రక్రియ ఎంత వరకూ పూర్తయిందని తహసీల్దార్ ఓబిలేసును అడిగి తెలుసుకున్నారు. కార్యక్రమంలో జిల్లా సర్వే రికార్డ్స్ అధికారి రూప్లానాయక్, తహసీల్దార్ ప్రతాప్ రెడ్డి, రీ సర్వే డీటీలు శ్రీలత, రాజ్‌కుమార్, సర్వేయర్లు మహేష్, సాయి, లచ్చానుపల్లి సర్పంచ్ మజ్జిగ గోపాల్ పాల్గొన్నారు.

బాల్య వివాహాలకు అడ్డుకట్ట వేయాలి

అనంతపురం అర్బన్: బాల్యవివాహాలకు అడ్డుకట్ట వేసే దిశగా కార్యక్రమాలు విస్తృతంగా నిర్వహించాలని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. కలెక్టర్ గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో 'జిల్లాస్థాయి కౌమార బాలికల సాధికారత, బాల్యవివాహాల నిషేధం కో–ఆర్డినేషన్ కమిటీ' సమావేశం నిర్వహించారు. బాల్య వివాహాలకు సంబంధించిన డేటాను ప్రతినెలా ఇవ్వాలని చెప్పారు.బాధిత బాలికలకు నైపుణ్యాభివృద్ధి కోర్సులపై అవగాహన కల్పించి నైపుణ్య పోర్టల్‌లో వివరాలు నమోదు చేయాలని సూచించారు. టీనేజీ ప్రెగ్నెన్సీపై హెల్త్ ఎడ్యుకేటర్ల ద్వారా అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. హైరిస్క్ ఎంతమంది ఉన్నారనే వివరాలను ఇవ్వాలన్నారు. ఆలయాలు, చర్చిలు, మసీదుల్లో జరిగిన వివాహాల వివరాలను నివేదిక రూపంలో అందించాలని దేవదాయశాఖ ఏడీ, డీఎం డబ్ల్యూఓని ఆదేశించారు. సమావేశంలో వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

ధర్మవరం కుడి కాలువకు నీటి సరఫరా నిలిపివేత



కుడి కాలువలో నీటి ప్రవాహం నిలిచి పోవడంతో చేపలు పడుతున్న చిన్నారులు

కూడేరు: మండల పరిధిలోని పీఏబీఆర్ నుంచి ధర్మవరం కుడి కాలువకు ఇరిగేషన్ అధికారులు గురువారం నీటి సరఫరా నిలిపివేశారు. తుంగభద్ర జలాశయం నుంచి ఇటీవల పీఏబీఆర్‌కు నీటి సరఫరా ఆగిపోవడంతో డ్యాంలోకి ఇన్‌ఫ్లో పూర్తిగా నిలిచిపోయింది. ఈ క్రమంలోనే కుడి కాలువకు నీటిని ఆపేశారు. గత ఏడాది డిసెంబర్ 2న కుడి కాలువకు నీటి విడుదలను ప్రారంభించారు. 49 చెరువులను నింపేందుకు దాదాపు 85 రోజులు సుమారు 4 టీఎంసీలకు పైగా సరఫరా చేశారు. కాలువలో నీటి ప్రవాహం తగ్గి పోవడంతో హంసాయపల్లి, జల్లిపల్లి, మరుట్ల, కలగళ్ల, కూడేరు గ్రామాల్లో చిన్నారులు, పెద్దలు వలలు వేసి చేపలు పట్టుకోవడం కనిపించింది.

ఆదుకోండి అమాత్యా

ఎన్నికలకు ముందు 'సూపర్‌సిక్స్' పేరుతో కరపత్రాలు తీసుకుని ఇంటింటికీ వెళ్లారు. అధికారంలోకి వస్తే 'అంత చేస్తాం.. ఇంత చేస్తాం' అని చెప్పారు. ఎలాగోలా గెలిచి, పదవులు కూడా చేపట్టారు.. కానీ ప్రజలనే మరిచిపోయారు. ఉమ్మడి జిల్లాకు చెందిన మంత్రుల వద్దనే కీలక శాఖలున్నా కనీస కనికరం చూపడం లేదు. పంటలకు గిట్టుబాటు ధర లేదు, ఆస్పత్రుల్లో మందులు లేవు, హాస్టళ్లలో అధ్వాన్న భోజనం.. చెప్పుకుంటూ వెళితే శాఖల పరిధిలోనే సమస్యలు విలయతాండవం చేస్తున్నా పట్టించుకోవడమే లేదు. అయితే, శాసనసభలో శుక్రవారం బడ్జెట్ ప్రవేశపెడుతుండటం .. ఆర్థిక శాఖ మంత్రి ఉమ్మడి జిల్లా నుంచే ప్రాతినిథ్యం వహిస్తున్న నేపథ్యంలో ఈ సారైనా పట్టించుకుంటారా.. లేక ఎప్పటిలాగే అరచేతిలో వైకుంఠం చూపి మమ అనిపిస్తారా.. అని ఉమ్మడి జిల్లా ప్రజలు చర్చించుకుంటున్నారు.



- ఉమ్మడి జిల్లా నుంచి ముగ్గురు మంత్రులు
- జిల్లాకు ప్రయోజనం శూన్యం
- ఫీజు రీయింబర్స్‌మెంట్ అతీగతీ లేదు
- ఆస్పత్రుల్లో మందుల్లేక అల్లాడుతున్న రోగులు
- నేడు అసెంబ్లీలో బడ్జెట్ ప్రవేశపెట్టనున్న మంత్రి పయ్యావుల
- ఇప్పటికైనా మేలు చేస్తారని ప్రజల ఎదురు చూపులు

సాక్షి ప్రతినిధి, అనంతపురం: కూటమి సర్కారు కొలువుదీరి తొమ్మిది నెలలవుతోంది. ఉమ్మడి అనంతపురం జిల్లా నుంచి 14 మంది 'కూటమి' ఎమ్మెల్యేలే ఉన్నారు. కేబినెట్‌లో ముగ్గురు మంత్రులు ఉమ్మడి జిల్లా నుంచి ప్రాతినిథ్యం వహిస్తున్నారు. ఉరవకొండ నుంచి గెలుపొందిన పయ్యావుల కేశవ్ ఆర్థిక మంత్రిగా కీలక బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. అనంతపురంలో ఫిబ్రవరి 5న నిర్వహించిన హార్టికల్చర్ కాంక్లేవ్‌లో ప్రసంగించిన ఆయన.. 'హంద్రీ–నీవా కాల్వ వెడల్పు పనులు చేపడతాం.. రైతులు మీసం మెలేసేలా చేస్తాం' అని ప్రకటించారు. కానీ లైనింగ్ పనులు చేస్తూ ఉమ్మడి జిల్లాను ఎడారిగా చేసేందుకు యత్నిస్తున్నారు. ఇప్పటివరకూ 'తల్లికి వందనం' లేక లక్షల మంది తల్లులు ఎదురు చూస్తున్నారు. ఏడాదికి రూ.20 వేల చొప్పున ఇస్తామన్న రైతు సాయం లేదు. కందికి మద్దతు ధర లేదు. టమాటకు గిట్టుబాటు ధర లభించడం లేదు. 9 నెలలైనా బీటీపీ ప్రాజెక్టు అతీగతీ లేదు. వేసవికి ముందే తాగునీటి కష్టాలు వెంటాడుతున్నాయి. ఆయా సమస్యల పరిష్కారానికి బడ్జెట్‌లోనైనా కనికరం చూపిస్తారేమోనని ప్రజలు ఆశగా ఎదురుచూస్తున్నారు.

సత్తెన్నా.. ఏందన్నా?

చివరి నిమిషంలో పోటీ చేసి గెలిచి అదృష్టం కొద్దీ పదవి దక్కించుకున్న సత్యకుమార్ యాదవ్ జిల్లాకు ఎప్పుడొస్తారో.. ఎక్కడుంటారో తెలియని పరిస్థితి. కీలకమైన ఆరోగ్యశాఖను ఆయన నిర్వహిస్తున్నారు. అయితే, సత్యకుమార్ ప్రాతినిథ్యం వహిస్తున్న ధర్మవరం ఏరియా ఆస్పత్రిలోనే మందులు లేవు. ఉమ్మడి అనంతపురం జిల్లాలో పీహెచ్‌సీ నుంచి సర్వజనాసుపత్రి వరకూ మందుల కొరత వేధిస్తోంది. బయటకు చిట్టీలు రాస్తుంటే రోగులు అల్లాడిపోతున్నారు. పడుకోవడానికి పడకలు లేవు. రోగులకు సరైన భోజనం లేదు. పెనుకొండలో మెడికల్ కాలేజీ పనులను ఆపేశారు. అనంతపురంలో ఎంసీహెచ్ బ్లాకుకు కేటాయించిన నిధులు భారీగా తగ్గించారు. మానసిక రోగులకు, డయాబెటిక్ రోగులకు మందులు లేవు. బడ్జెట్ నేపథ్యంలో 'సత్తెన్నా.. గెలిపించిన జిల్లాకు కాసింత మేలు చేయన్నా' అని ప్రజలు అంటున్నారు.

సవితమ్మా.. ఇటు చూడమ్మా

పెనుకొండ నుంచి ఎమ్మెల్యేగా ఎన్నికైన సవిత బీసీ సంక్షేమ శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినా తమకు ఒరిగిందేమీ లేదని ఉమ్మడి జిల్లాలో అత్యధిక శాతం ఉన్న బడుగు బలహీన వర్గాలు అంటున్నాయి. ప్రభుత్వం ఫీజు రీయింబర్సుమెంటు నిధులు విడుదల చేయకపోవడంతో వేలాదిమంది విద్యార్థులకు సర్టిఫికెట్లు అందని దుస్థితి నెలకొంది. విద్యార్థి సంఘాలు ఆందోళనకు దిగినా పట్టించుకోవడం లేదు. బీసీ హాస్టళ్లలో అధ్వాన భోజనంతో పేద పిల్లలు ఇబ్బందులు పడుతున్నారు. ఇటీవల ఫీజుల కోసం వేధిస్తున్నారనే ఒత్తిడితో నారాయణ కళాశాల విద్యార్థి ఆత్మహత్య చేసుకున్నాడు. ఈ క్రమంలో 'మంత్రి సవితమ్మా.. కనీసం జిల్లాకైనా ప్రయోజనం చేకూర్చమ్మా' అని కోరుతున్నారు.

'అన్నదాత సుఖీభవ'కు అర్హులు	5,50,000
'తల్లికి వందనం' అర్హులు	3,66,000
ఫీజురీయింబర్స్‌మెంట్ కోసం ఎదురు చేస్తున్న విద్యార్థుల సంఖ్య	80,000 వరకు

ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి

సూపర్ సిక్స్ హామీలు అమలు చేస్తారని ప్రజలు నమ్మి కూటమి ప్రభుత్వానికి అవకాశమిచ్చారు. ఉమ్మడి జిల్లాలోని ముగ్గురు మంత్రులు, ప్రజాప్రతినిధులు హామీల అమలుకు కృషి చేయాలి. హంద్రీ–నీవా సామర్థ్యాన్ని పెంచడంతో పాటు హెచ్ఎల్‌సీ ఆధునీకరణ చేపట్టేందుకు నిధులను బడ్జెట్‌లో కేటాయించాలి. వ్యవసాయాన్ని నమ్ముకున్న రైతులను గట్టెక్కించాలి. ప్రజల నమ్మకాన్ని నిలబెట్టుకోవాలి.

– అనంత వెంకటరామిరెడ్డి, వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు

ఆ ప్రొఫెసర్ల భవితవ్యం తేలేది నేడే!

- 'సుప్రీం' తీర్పుపై సర్వత్రా ఉత్కంఠ

అనంతపురం: జేఎన్‌టీయూ (ఏ)లో గత టీడీపీ ప్రభుత్వ హయాంలో 9 ప్రొఫెసర్ పోస్టుల నియామకానికి సంబంధించిన వివాదంపై సుప్రీం కోర్టు శుక్రవారం తీర్పు వెలువరించనుంది. దీంతో సర్వత్రా ఉత్కంఠ నెలకొంది. వివరాలు.. జేఎన్‌టీయూ (ఏ) పరిధిలో 10 ప్రొఫెసర్ ఉద్యోగాలకు సంబంధించి 2017 అక్టోబర్ 10న నోటిఫికేషన్ విడుదల చేశారు. జేఎన్‌టీయూ అనంతపురం ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ పులివెందుల ఇంజినీరింగ్ కళాశాల, జేఎన్‌టీయూ కలికిరి ఇంజినీరింగ్ కళాశాలల్లో పోస్టుల భర్తీకి ప్రకటన ఇచ్చారు. 2017 నవంబర్ 23 తేదీని దరఖాస్తుకు తుది గడువుగా నిర్దేశించారు. అయితే ఉద్యోగ నియామకాలకు సంబంధించి విధివిధానాల్లో లోపాలు ఉన్నాయనే కారణంతో కొందరు హైకోర్టులో కేసు వేశారు. దీంతో ఏడాది జాప్యం జరిగింది.ఇంటర్వ్యూలు నిర్వహించుకుని ఫలితాలను పెండింగ్‌లో పెట్టమని హైకోర్టు ఆదేశించింది. అయితే అప్పటి సార్వత్రిక ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని 2019 జనవరిలో హడావుడిగా ప్రొఫెసర్ పోస్టులకు సంబంధించి నియామకాలు పూర్తి చేశారు. అనర్హులు అయినప్పటికీ కొన్ని విభాగాల్లో ప్రొఫెసర్ ఉద్యోగాలు కట్టబెట్టారు. దీంతో ఆయా నియామకాలు రద్దు చేయాలని హైకోర్టులో పలువురు వ్యాజ్యం దాఖలు చేశారు. ఏపీఐ (అకడమిక్ ఫర్‌ఫార్మెన్స్ ఇండెక్స్) స్కోరు ప్రొఫెసర్ ఉద్యోగానికి తప్పనిసరిగా 400 పాయింట్లు ఉండాలి. దరఖాస్తు సమయంలో ఏపీఐ స్కోరు తక్కువగా ఉందని గమనించి.. తిరిగి ఏపీఐ స్కోరు తెప్పించడం వివాదాస్పదమైంది. పాలిమర్‌లో పీహెచ్‌డీ చేస్తే మెకానికల్ ఇంజినీరింగ్‌లో ఉద్యోగం కట్టబెట్టారు. నోటిఫికేషన్ సమయానికి పీహెచ్‌డీ లేకున్నా మరో ఇద్దరిని ప్రొఫెసర్ ఉద్యోగానికి ఎంపిక చేశారు. రోస్టర్ పాయింట్లు పాటించలేదు. ఈ కారణాలతో హైకోర్టులో వ్యాజం దాఖలైంది. వీటిని పరిశీలించిన సింగిల్ జడ్జి... రోస్టర్ పాయింట్లు లేని కారణంగా నోటిఫికేషన్ రద్దు చేయాలని ఆదేశాలు జారీ చేశారు. దీంతో అభ్యర్థులు తిరిగి హైకోర్టు డివిజన్ బెంచ్‌ను ఆశ్రయించగా.. విన్నపాన్ని బెంచ్ మన్నించలేదు. ఈ క్రమంలోనే అభ్యర్థులు సుప్రీంకోర్టును ఆశ్రయించారు. 'సుప్రీం' శుక్రవారం తీర్పు వెలువరించనుంది. ఈ నేపథ్యంలో ఆదేశాలు ఎలా ఉండనున్నాయనే అంశంపై సర్వత్రా ఉత్కంఠ నెలకొంది.

తాగునీరు నెలన్నరకోసారి వస్తున్నాయ్

- ఫ్లోరైడ్ నీటితో తీవ్ర ఇబ్బందులు
- పైప్‌లైన్ల లీకుతో నీరు కలుషితం
- 'ఫోన్‌ఇన్'లో కలెక్టర్‌కు ప్రజల ఫిర్యాదు



ప్రజల నుంచి ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ వినోద్‌కుమార్

అనంతపురం అర్బన్: ఒకటిన్నర నెలకోసారి తాగునీళ్లు వస్తున్నాయంటూ కలెక్టర్ వినోద్ కుమార్‌కు ఓ వ్యక్తి ఫిర్యాదు చేశారు. కలెక్టర్ గురువారం అనంతపురం ఆకాశవాణి కేంద్రం నుంచి గ్రామీణ, పట్టణ ప్రాంతాల్లో తాగునీటి సమస్యలపై 'అనంతమిత్ర ఫోన్‌ఇన్' కార్యక్రమం నిర్వహించారు. దాదాపు 15 మంది తాగునీటి సమస్యలపై ఫిర్యాదు చేశారు. కార్యక్రమంలో ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్‌ఈ ఆర్.సురేష్, జెడ్పీ సీఈఓ రామచంద్రారెడ్డి, నగర పాలక కమిషనర్ బాలరాజు, ప్రోగ్రాం డైరెక్టర్ నాగేశ్వరరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఫిర్యాదుల్లో కొన్ని...

ఫిర్యాదుదారు: నా పేరు సుధాకర్‌రావు. మాది అనంతపురం రూరల్ మండలం ఎ.నారాయణపురం పంచాయతీ.ఎ.నారాయణపురం,పాపంపేట, గణేష్‌నగర్ కాలనీలకు ఒకటిన్నర నెలకోసారి మంచినీళ్లు వస్తాయి. అవి కూడా ఉప్పునీరు కలిపి వదులుతున్నారు. పంచాయతీలో మూడు మోటర్లు ఉన్నా ప్రయోజనం లేకుండా పోతోంది.

కలెక్టర్: మీ ప్రాంతంలో తాగునీటి సమస్య పరిష్కారానికి అవసరమైన చర్యలు తీసుకుంటాం.

ఫిర్యాదుదారు: నా పేరు నరేష్. మాది పామిడి మండలం పి.కొండాపురం గ్రామం. మా ఎస్సీ కాలనీలో 350 కుటుంబాలు ఉన్నాయి. ఫ్లోరైడ్ నీటి కారణంగా చిన్న వయసులోనే కాళ్లు వంకర్లు పోతున్నాయి. మినరల్ వాటర్ ప్లాంట్ లేక ఇబ్బంది పడుతున్నాం. పామిడి నుంచి ట్యాంకర్ల ద్వారా నీటిని తీసుకొచ్చి ఒక బిందె రూ.10కి అమ్ముతున్నారు. పంచాయతీ నీరు మూడు రోజుల కోసారి వస్తోంది. ఆర్‌ఓ ప్లాంట్ ఏర్పాటు చేసి ఆరోగ్యాలు కాపాడాలి.

కలెక్టర్: మీ ప్రాంతానికి అధికారులను పంపిస్తాం. క్షేత్రస్థాయిలో పర్యటించి సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

ఫిర్యాదుదారు: నా పేరు రాఘవేంద్ర. పెద్ద వడుగూరు గ్రామం. తాగునీటి పైప్‌లైన్లు లీకై రోడ్లపై నీరు పారుతోంది. దీంతో నీరు కలుషితమవుతోంది. లీకేజీలు అరికట్టడంతో పాటు ఓవర్‌హెడ్ ట్యాంక్‌లను శుభ్రం చేయించేలా చర్యలు తీసుకోవాలి.

కలెక్టర్: తక్షణ చర్యలు చేపట్టి పైప్‌లైన్ల లీకేజీ సమస్యను పరిష్కరిస్తాం. షెడ్యూల్ ప్రకారం ఓవర్‌హెడ్ ట్యాంక్‌లు శుభ్రం చేయించేలా ఎంపీడీఓ, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈకి ఆదేశాలిస్తాం.

ఫిర్యాదుదారు: నా పేరు మధుసూదన్‌రెడ్డి. గార్లదిన్నె మండల పాపినేపాలేం. మా ప్రాంతంలో 15 ఏళ్ల నుంచి ఉన్న చెక్‌డ్యాంలను పూడ్చివేయడంతో పశువులకు నీరు లేకుండా పోయింది.

కలెక్టర్: మీ గ్రామానికి రెవెన్యూ అధికారులు వచ్చి పరిశీలిస్తారు. వీలైనంత త్వరగా సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకుంటారు.

15 రోజుల్లో మల్టీ లెవల్ పార్కింగ్

'అనంతపురం నగరంలో మార్పు కనిపించాలి. ప్రధానంగా మల్టీ లెవల్ పార్కింగ్ ఏర్పాటు చేయాల్సిన అవసరం ఉంది. ఇందుకు సంబంధించి ప్రదేశాలను గుర్తించడంతో పాటు 15 రోజుల్లో పనులు పూర్తి చేయాలి' అని కలెక్టర్ వి.వినోద్‌కుమార్ సంబంధిత అధికారులను ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్ హాలులో నేషనల్ క్లీన్ ఎయిర్ ప్రోగ్రాం (ఎన్‌సీఏపీ)పై అధికారులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ మల్టీలెవల్ పార్కింగ్ ప్రక్రియను యుద్ధప్రాతిపదికన చేపట్టాలన్నారు. ప్లాంటేషన్ ప్రక్రియ మార్చి 25 నాటికి పూర్తి చేయాలన్నారు. ప్రతి ఒక్కరూ బాధ్యతగా ఒక మొక్క నాటి సంరక్షించాలన్నారు. నగర పరిధిలో పూర్తయిన సీసీ రోడ్లు, అభివృద్ధి పనులను ప్రజాప్రతినిధులతో ప్రారంభోత్సవం చేయించాలన్నారు. సమావేశంలో నగర పాలక కమిషనర్ బాలస్వామి, ఈఈ షాకీర్ హుస్సేన్, జిల్లా వ్యవసాయాధికారి ఉమామహేశ్వరమ్మ తదితరులున్నారు.

పరాకాష్టకు కక్ష సాధింపులు

- పోసాని కృష్ణమురళీ అరెస్టు అప్రజాస్వామికం
- వైఎస్సార్ సీపీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి



అనంతపురం కార్పొరేషన్: రాష్ట్రంలో వైఎస్సార్ సీపీ ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, నాయకులను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం పాల్పడుతున్న కక్ష సాధింపులు పరాకాష్టకు చేరాయని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనంత వెంకటరామిరెడ్డి పేర్కొన్నారు. గురువారం ఆయన అనంతపురంలోని తన క్యాంపు కార్యాలయంలో విలేకరులతో మాట్లాడారు. సినీ నటుడు పోసాని కృష్ణమురళీ అరెస్టును ఖండించారు. అప్రజాస్వామికంగా పోసాని కృష్ణమురళీని పోలీసులు అరెస్టు చేశారన్నారు. ఓ రాజకీయ పార్టీ కార్యకర్త ఇచ్చిన ఫిర్యాదును ఆధారంగా చేసుకుని కనీసం ప్రాథమిక విచారణ చేయకుండా రాత్రికి రాత్రే పోసానిని అరెస్టు చేయడం అప్రజాస్వామికమని ధ్వజమెత్తారు. చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం కక్ష సాధింపుల కోసం వ్యవస్థలను వాడుకుంటోందని ఆరోపించారు. అందులో పోలీసులు భాగస్వాములవుతుండడం దారుణమన్నారు. చట్టాలను అమలు చేయాల్సిన పోలీసులు కూటమి ప్రభుత్వం ఆగడాలకు వెన్నుదన్నుగా నిలుస్తున్నారని ధ్వజమెత్తారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి పోలీసు వ్యవస్థను దుర్వినియోగం చేస్తోందన్నారు. పోలీసుల తీరుపై సాక్షాత్తు హైకోర్టు మొట్టికాయలు వేస్తున్నా.. వారిలో మార్పు రాకపోవడం బాధాకరమన్నారు. హామీలు చేయకుండా సీఎం చంద్రబాబు డైవర్షన్ పాలిటిక్స్ చేస్తున్నారన్నారు.కూటమిలోని పార్టీలకు వ్యతిరేకంగా ఎవరు మాట్లాడినా.. తప్పుడు కేసులు నమోదు చేస్తూ.. ప్రశ్నించే గొంతులను అణగదొక్కుతున్నారన్నారు. లోకేష్ రెడ్ బుక్ రాజ్యాంగాన్ని అమలు చేయడానికే సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కల్యాణ్ పరిమితమయ్యారన్నారు. కూటమి ప్రభుత్వానికి రోజులు దగ్గర పడ్డాయని, త్వరలో ప్రజాస్వామ్య పద్ధతిలో బుద్ధి చెబుతామని 'అనంత' హెచ్చరించారు.

రమణీయం.. రథోత్సవం

- భక్తులతో కిటకిటలాడిన బుగ్గ రామలింగేశ్వరుడి క్షేత్రం
- కమనీయంగా స్వామి కల్యాణోత్సవం



బుగ్గ రామలింగేశ్వర స్వామి రథోత్సవంలో పాల్గొన్న భక్తజనం (ఇన్‌సెట్) స్వామి అమ్మవార్లు

తాడిపత్రి రూరల్: పట్టణంలో బుగ్గ రామలింగేశ్వర స్వామి రథోత్సవం గురువారం కనులపండువగా జరిగింది. హరహర మహాదేవ శంభో శంకర అంటూ భక్తులు తన్మయత్వం చెందారు. గాంధీ కట్ట నుంచి ప్రారంభమైన రథోత్సవం మోయిన్ బజార్ మీదుగా సాగింది. దారి పొడవునా భక్తులు రథంపై పూలు జల్లారు. టెంకాయలు కొట్టి, హారతులు పట్టి మొక్కులు తీర్చుకున్నారు. రథోత్సవంలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా పోలీసు బందోబస్తు ఏర్పాటు చేశారు.

కమనీయం.. కల్యాణోత్సవం

అంతకుముందు ఆలయం వద్ద శివపార్వతీదేవిల కల్యాణోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా కల్యాణ వేదికను సుందరంగా అలంకరించారు. మూలమూర్తులను ప్రత్యేకంగా ముస్తాబు చేసి మంగళవాయిద్యాల నడుమ అర్చకులు కల్యాణ వేదిక వద్దకు తీసుకువచ్చారు. శాస్త్రోక్తంగా స్వామి, అమ్మవార్ల కల్యాణోత్సవం జరిపించారు. పార్వతీ సమేత బుగ్గరామలింగేశ్వర స్వామి కల్యాణోత్సవానికి పెద్ద ఎత్తున తరలివచ్చిన భక్తులు పరవశించిపోయారు. భక్తులకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

సైబర్ మోసాలపై అవగాహన



విద్యార్థులకు అవగాహన కల్పిస్తున్న దృశ్యం

అనంతపురం: సైబర్ సురక్ష (మన భద్రత– మన బాధ్యత) కార్యక్రమంలో భాగంగా గురువారం అనంతపురం వన్‌టౌన్, ఫోర్త్ టౌన్, బెళుగుప్ప పీఎస్‌ల పరిధుల్లో విద్యార్థులు, ప్రజలకు అవగాహన కల్పించారు. సైబర్ నేరాలు నిరోధించడానికి తీసుకోవాల్సిన జాగ్రత్తలను డిజిటల్ వాహనాల ద్వారా వివరించారు. సైబర్ మోసగాళ్ల బారిన పడితే వెంటనే టోల్‌ఫ్రీ నంబర్ 1930కు కాల్ చేయవచ్చని లేదా సైబర్ క్రైమ్ పోర్టల్ https://cybercrime.gov.in/కు ఫిర్యాదు చేయాలని పోలీసులు విజ్ఞప్తి చేశారు.

క్లుప్తంగా

తాగునీటి సమస్యపై మహిళల కన్నెర్ర


ఖాళీ బిందెలతో మహిళలు

శింగనమల: తాగునీటి సమస్యపై మహిళలు కన్నెర్ర చేశారు. ప్రభుత్వ తీరుపై ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. వివరాలు.. శింగనమల మండలంలోని శివపురం గ్రామ ఎస్సీ కాలనీలో చాలా రోజులుగా తాగునీటి సమస్య నెలకొంది. ప్రజాప్రతినిధుల దృష్టికి తీసుకెళ్లినా పట్టించుకోలేదు. ఇటీవల ఆర్డీటీ సంస్థ వారికి విన్నవించగా.. బోరు వేయించి, మోటారు బిగించారు. ఈ క్రమంలో బోరుకు విద్యుత్ సౌకర్యం కల్పించాల్సిన అధికారులు పట్టించుకోవడం లేదు. దీనిపై ఎన్నిసార్లు విజ్ఞప్తి చేసినా స్పందన లేకపోవడంతో గురువారం మహిళలు ఖాళీ బిందెలతో నిరసన తెలిపారు. నీటి కోసం కిలోమీటరు దూరంలోని చెరువు కాలువ వద్దకు వెళ్లాల్సి వస్తోందని వాపోయారు. ఇప్పటికైనా తగిన చర్యలు తీసుకోవాలని కోరారు.

మళ్లీ జెడ్పీకి వచ్చేందుకు ప్రయత్నాలు

అనంతపురం సిటీ: జిల్లా పరిషత్ కార్యాలయంలో గతంలో పని చేసి బదిలీపై వెళ్లిన కొందరు ఉద్యోగులు మళ్లీ డిప్యుటేషన్‌పై ఇక్కడికే వచ్చేందుకు పావులు కదుపుతున్నారు. ఈ అంశం ఇప్పుడు జిల్లా పరిషత్ వర్గాల్లో చర్చనీయాంశమైంది. గతంలో పని చేసిన కొందరు సీటుల వద్ద ఉంటూనే.. అనేక అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని గుర్తించి వారిపై బదిలీ వేటు వేసిన సంగతి తెలిసిందే. ఆర్నెల్లు కూడా గడవకనే కొందరు ఉద్యోగులు జెడ్పీ ముఖ్య అధికారుల ద్వారా మళ్లీ జెడ్పీకి డిప్యుటేషన్‌పై వచ్చేందుకు తమ వంతు ప్రయత్నాలు ముమ్మరం చేశారు. ఓ డివిజనల్ స్థాయి అధికారి ద్వారా జెడ్పీ ముఖ్య అధికారులపై ఒత్తిడి తెస్తున్నట్లు సమాచారం. డిప్యుటేషన్‌పై రావాలనుకుంటున్న ఉద్యోగులకు సంబంధించిన ఫైల్‌ను జెడ్పీ అధికారులు సిద్ధం చేయగా పాలకవర్గ పెద్దలు తిప్పికొట్టినట్లు విశ్వసనీయ సమాచారం.

కోనేరులో పడి యువకుడికి తీవ్ర గాయాలు

గుత్తి రూరల్: మండలంలోని ధర్మాపురం గ్రామానికి చెందిన యువకుడు శ్రీనివాసులు గురువారం యాగంటి క్షేత్రంలోని కోనేరులో పడి తీవ్రంగా గాయపడ్డాడు. కుటుంబసభ్యులు తెలిపిన మేరకు... కుటుంబసభ్యులతో కలసి శ్రీనివాసులు నంద్యాల జిల్లా బనగానపల్లి మండలం యాగంటి పుణ్యక్షేత్రానికి మహా శివరాత్రి సందర్భంగా నిద్ర చేసేందుకు వెళ్లాడు. ఈ క్రమంలో గురువారం ఉదయం కోనేరులో ఈత కొట్టేందుకు సిద్ధమైన ఆయన పైనుంచి డైవ్ చేశాడు. లోతు తక్కువగా ఉండడంతో తలకు బలమైన గాయమైంది. గమనించిన కుటుంబసభ్యులు యాగంటిలోని పీహెచ్‌సీలో ప్రథమ చికిత్స చేయించి, గుత్తిలోని ప్రభుత్వాస్పత్రికి తీసుకువచ్చారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన చికిత్స కోసం అనంతపురానికి రెఫర్ చేశారు.

నిమిషం ఆలస్యమైనా నో ఎంట్రీ

- రేపటి నుంచి ఇంటర్ పరీక్షలు
- జిల్లా వ్యాప్తంగా 63 కేంద్రాలు ఏర్పాటు
- పరీక్షలు రాయనున్న 48,690 మంది విద్యార్థులు
- ఇప్పటికే పోలీస్‌స్టేషన్లకు చేరిన ప్రశ్నపత్రాలు
- విద్యార్థులు గంట ముందే పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలి


పరీక్ష కేంద్రాన్ని పరిశీలిస్తున్న ఇంటర్ బోర్డు అధికారులు

అనంతపురం ఎడ్యుకేషన్: ఇంటర్ వార్షిక పరీక్షలకు ఇక ఒక రోజు మాత్రమే గడువు ఉంది. మార్చి 1న మొదటి సంవత్సరం విద్యార్థులకు, 3న ద్వితీయ సంవత్సరం విద్యార్థులకు వార్షిక పరీక్షలు ప్రారంభం కానున్నాయి. మార్చి 20వ తేదీ వరకూ కొనసాగుతాయి. జిల్లాలో పరీక్షల నిర్వహణకు ఇంటర్ బోర్డు అధికారులు పటిష్ట ఏర్పాట్లు చేశారు. జిల్లాకు చేరిన మూడు సెట్ల ప్రశ్నపత్రాలను ఆయా పోలీస్‌స్టేషన్లలో భద్రపరిచారు. మొత్తం 63 కేంద్రాలు ఏర్పాటు చేశారు. జనరల్, ఒకేషనల్ కలిపి మొత్తం 48,690 మంది విద్యార్థులు పరీక్షలు రాయనున్నారు. వీరిలో మొదటి సంవత్సరం విద్యార్థులు 25,730 మంది, ద్వితీయ సంవత్సరం విద్యార్థులు 22,960 మంది ఉన్నారు. ఇప్పటికే హాల్‌టికెట్లు చేరాయి. విద్యార్థులందరూ హాల్‌టికెట్లు తీసుకున్నారు. రోజూ ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు పరీక్షలు జరుగుతాయి. 8 గంటల నుంచి పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులను అనుమతిస్తారు. 8.30 గంటల నుంచి గదుల్లో ఓఎంఆర్ షీట్లు అందజేస్తారు. విద్యార్థులకు అందజేసిన ఓఎంఆర్ షీట్లను ఒకటికి రెండుసార్లు చెక్ చేసుకోవాలని అధికారులు సూచిస్తున్నారు. ఒక్క నిమిషం ఆలస్యమైనా విద్యార్థులను లోపలకు అనుమతించరాదని బోర్డు అధికారులు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు.

ఆర్‌ఐఓ కార్యాలయంలో కంట్రోల్ రూం

పరీక్షల సమయంలో ఎలాంటి సందేహాలున్నా విద్యార్థులు, తల్లిదండ్రులు నివృత్తి చేసుకునేందుకు జిల్లాస్థాయిలో ఒక కంట్రోల్ రూంను ఏర్పాటు చేశారు. ఇంటర్ బోర్డ్ ఆర్‌ఐఓ కార్యాలయంలో రోజూ ఉదయం 9 నుంచి సాయంత్రం 6 గంటల వరకు కంట్రోల్ రూం సిబ్బంది అందుబాటులో ఉంటారు. ఎవరైనా 08554-274256 నంబర్‌కు ఫోన్ చేసి సందేహాలు నివృత్తి చేసుకోవచ్చు.

ఏర్పాట్లు పూర్తి

జిల్లాలోని 63 కేంద్రాల్లో ఇంటర్ వార్షిక పరీక్షల నిర్వహణకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశాం. ప్రతి గదిలోనూ ఏర్పాటు చేసిన సీసీ కెమెరాల ద్వారా పుటేజీలను స్ట్రీమింగ్‌లో జిల్లా, రాష్ట్ర అధికారులు పరిశీలించేలా అనుసంధానం చేశారు. కేంద్రాల్లో ఎలాంటి పొరపాట్లు, అవాంఛనీయ ఘటనలు జరిగినా సీఎస్, డిపార్ట్‌మెంటల్ అధికారులదే బాధ్యత. అందరినీ సమన్వయం చేసుకుని పరీక్షలు ప్రశాంతంగా జరిగేలా చూడాలి.

– ఎం. వెంకటరమణనాయక్, ఆర్‌ఐఓ, ఇంటర్ బోర్డు

సెల్‌ఫోన్ అనుమతులుండవు

పరీక్ష కేంద్రాల్లోకి విద్యార్థులతో పాటు ఏ స్థాయి అధికారికీ సెల్‌ఫోన్ అనుమతులుండవు. ప్రతి పరీక్ష కేంద్రానికి ఇంటర్ బోర్డు నుంచి కీప్యాడ్ మొబైల్, సిమ్‌కార్డ్ సరఫరా చేశారు. ఇప్పటికే ఆయా చీఫ్ సూపరింటెండెంట్లకు వాటిని అందజేశారు. ఈ మొబైల్ ద్వారానే బోర్డుకు విద్యార్థుల అటెండెన్స్, ఇతర సమాచారం ఎప్పటికప్పుడు చేరవేయాల్సి ఉంటుంది. ఇవి తప్ప వ్యక్తిగత మొబైల్ ఫోన్లను కేంద్రంలోకి తీసుకెళ్లరాదు. ప్రతి కేంద్రంలోనూ సీసీ కెమెరాలు అమర్చారు. వీటిని జిల్లా, రాష్ట్ర బోర్డు కార్యాలయాలకు అనుసంధానం చేయడంతో లైవ్ స్ట్రీమింగ్‌లో ఆయా స్థాయి అధికారులు ఎప్పటికప్పుడు పరిశీలించనున్నారు. అలాగే ప్రశ్న పత్రాలపై క్యూఆర్ కోడ్ ఉంటుంది. ఎవరైనా లీక్ చేస్తే కచ్చితంగా దొరికిపోతారు. ప్రతి కేంద్రం వద్ద 144 సెక్షన్ అమలులో ఉంటుంది.


బోర్డు సరఫరా చేసిన కీప్యాడ్ మొబైల్ ఇదే

అగ్నికి ఆహుతైన గుజరీ దుకాణం


మంటల్లో కాలిపోతున్న దుకాణం

రాప్తాడు రూరల్: అనంతపురం రూరల్ మండలం పాపంపేటలోని ఫాతిమా మసీదు పక్కన ఉన్న గుజరీ దుకాణం అగ్నికి ఆహుతైంది. వివరాలు... పాపంపేట నివాసి శ్రీరాములు, తన కుమారుడు ప్రశాంత్‌తో కలసి ఫాతిమా మసీదు పక్కన ఖాళీ స్థలంలో షెడ్డు ఏర్పాటు చేసుకుని గుజరీ దుకాణం నిర్వహిస్తున్నాడు. రోజు లాగే లావాదేవీలు ముగించుకున్న అనంతరం బుధవారం రాత్రి విద్యుత్ మెయిన్ స్విచ్ ఆఫ్ చేసి ఇంటికెళ్లారు. గురువారం వేకువజాము 1.15 గంటలకు మంటలు చెలరేగాయి. శివరాత్రి జాగారణ చేస్తున్న వారు ప్రమాదాన్ని గుర్తించి సమాచారం ఇవ్వడంతో యజమాని అక్కడకు చేరుకున్నాడు. ఈ లోపు మంటలు ఎగిసి పడుతుండడంతో విషయం తెలుసుకున్న అనంతపురం రూరల్ పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది అక్కడకు చేరుకుని మంటలు ఆర్పారు. అప్పటికీ గుజరీ దుకాణం పూర్తిగా కాలిపోయి, దాదాపు రూ. 7 లక్షలు నష్టం వాటిల్లింది. కాగా, మంటల ఎగిసి పడుతున్న సమయంలోనే శ్రీరాములు ఒక్కసారిగా కుప్పకూలిపోయాడు. కుటుంబసభ్యులు వెంటనే సర్వజనాస్పత్రికి తరలించారు.

ఉన్నోళ్లకే లింగోద్భవ దర్శనమా?

- తాడిపత్రి ఆలయాల్లో తారస్థాయికి చేరిన 'అడుసుమిల్లి' ఆగడాలు


లింగోద్భవం సమయంలో భక్తులను అనుమతించకుండా తలుపులు మూసిన దృశ్యం

సాక్షి, టాస్క్‌ఫోర్స్: ప్రసిద్ధిగాంచిన తాడిపత్రిలోని పురాతన ఆలయాల్లో స్థానిక మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకరరెడ్డి ప్రధాన అనుచరుడు, బీఎస్–4 వాహన కేసుల్లో ప్రధాన నిందితుడిగా ఉన్న అడుసుమిల్లి చంద్ర ఆగడాలు మితిమీరిపోయాయి. మహాశివరాత్రి సందర్భంగా బుగ్గరామలింగేశ్వర స్వామి ఆలయంలో ఆయన సాగించిన ఆగడాలతో తమ మనోభావాలు దెబ్బతిన్నాయని పలువురు భక్తులు వాపోయారు. బుధవారం అర్ధరాత్రి 12 గంటలకు లింగోద్భవ కాలంలో బుగ్గ రామలింగేశ్వరునికి ప్రత్యేక అభిషేకం నిర్వహిస్తారు. ఆ సమయంలో సామాన్య భక్తులు గుడిలోకి వెళ్లాలంటే సాధ్యం కాదు. దాతలకు ప్రత్యేక అవకాశం కల్పిస్తారు. దీంతో సామాన్య భక్తులు లింగోద్భవ సమయంలో ఆలయం వెలుపలే సుమారు 2గంటల పాటు వేచి ఉండాల్సి వస్తుంది. బుధవారం అర్ధరాత్రి జరిగిన లింగోద్భవ దర్శనానికి టీడీపీ నేత అడుసుమిల్లి మాత్రం తనకు కావాల్సిన వారిని నిబంధనలకు విరుద్ధంగా లోపలకు అనుమతించి ఆలయ తలుపులు మూసివేయించడం విమర్శలకు తావిచ్చింది. ఉన్నోళ్ళకేనా దేవుడి దర్శనమంటూ పలువురు భక్తులు ఆవేదన వ్యక్తం చేశారు. కాగా, అడుసుమల్లి హల్‌చల్ చేస్తుండడంతో భక్తుల రద్దీని కట్టడి చేసేందుకు పోలీసులు నానా ఇబ్బందులు పడ్డారు. ఒకానొక దశలో సదరు నేత ఒంటెద్దు పోకడలపై పోలీసులు సైతం అసహనం వ్యక్తం చేశారు.

ఎమ్మెల్యే, చైర్మన్ ఆదేశాలు తుంగలోకి

రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ఏర్పాటైన తర్వాత ఆలయాల ధర్మకర్తల మండలి నియమకాల్లో జాప్యం చోటు చేసుకుంది. దీంతో బుగ్గరామలింగేశ్వరస్వామి, చింతల వేంకటరమణస్వామి, పెద్దపప్పూరు అశ్వత్థనారాయణ క్షేత్రం పర్యవేక్షణ తాత్కాలిక బాధ్యతలను అడుసుమిల్లికి జేసీ ప్రభాకరరెడ్డి అప్పగించారు. ఈ క్రమంలోనే తాడిపత్రి ఆలయాలు ప్రజల సంపద అని, వాటి అభివృద్ధి విషయంలో ప్రజల భాగస్వామ్యం కూడా ఎంతో అవసరమని, దైవ దర్శనం విషయంలో అందరూ సమానమేనని ఇటీవల ఎమ్మెల్యే జేసీ అస్మిత్‌రెడ్డి, మున్సిపల్ చైర్మన్ జేసీ ప్రభాకర్‌రెడ్డి ప్రకటించారు. దీనిపై పెద్ద ఎత్తున హర్షం వ్యక్తమైంది. అయితే జేసీ ప్రభాకరరెడ్డి ఆదేశాలను అడుసుమిల్లి తుంగలో తొక్కి ఆలయాల్లోని అర్చకులపై పెత్తనం చెలాయిస్తున్నాడనే ఆరోపణలు వెల్లువెత్తాయి. శివదీక్ష పేరుతో మాల వేసి ఆలంలోనే తిష్టవేసి ఆలయ కైంకర్యాల్లో జోక్యం చేసుకోవడం పలు విమర్శలకు తావిచ్చింది. సాధారణంగా తాడిపత్రిలోని పురాతన ఆలయాల్లో ఏదైనా కార్యక్రమం నిర్వహించాలంటే దేవదాయ శాఖ, పురావస్తు శాఖ అనుమతులు తప్పని సరి. అయితే అడుసుమిల్లి మాత్రం తన అనుమతి లేనిదే ఆయా ఆలయాల్లో ఎలాంటి కార్యక్రమాలు జరపరాదంటూ దౌర్జన్యాలకు తెరలేపడంతో భక్తులు మనోవేదనకు లోనవుతున్నారు.

ప్రేమ విఫలం.. బిహార్ యువకుడి బలవన్మరణం

రాప్తాడు రూరల్: తాను ప్రేమించిన యువతి మరో వ్యక్తిని పెళ్లి చేసుకోవడంతో మనస్తాపం చెంది బిహార్‌కు చెందిన ఓ యువకుడు ఆత్మహత్య చేసుకున్నాడు. పోలీసులు తెలిపిన మేరకు... అనంతపురం నగరానికి చెందిన చంద్రశేఖర్‌రెడ్డికి సోములదొడ్డి నుంచి నాగిరెడ్డిపల్లికి వెళ్లే దారిలో తోట ఉంది. ఇందులో ఆవుల పోషణకు బిహార్ రాష్ట్రానికి చెందిన పూల్‌కుమార్ (22), ఆయన సోదరుడిని నియమించుకున్నాడు. అప్పటికే తన సొంతూరుకు చెందిన ఓ యువతిని ప్రేమిస్తున్న పూల్‌కుమార్... ఇదే విషయాన్ని ఇంట్లో పెద్దలకు చెప్పి, డబ్బు సమకూర్చుకుని వచ్చిన తర్వాత పెళ్లి చేసుకుంటానని తెలిపాడు. అయితే అక్కడ ఏమి జరిగిందో తెలియదు కానీ, ఇటీవల సదరు యువతి మరో వ్యక్తిని పెళ్లి చేసుకుంది. ఈ విషయం తెలుసుకున్న పూల్‌కుమార్ తీవ్ర మనోవేదనకు లోనై గురువారం తెల్లవారుజామున తాను పని చేస్తున్న షెడ్డులోనే తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. సమాచారం అందుకున్న అపంతపురం రూరల్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి సోదరుడి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశారు.

బరితెగింపు రాజకీయాలకు నిదర్శనం


మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే విశ్వేశ్వర రెడ్డి

అనంతపురం కార్పొరేషన్: సినీనటుడు, రచయిత పోసాని మురళీ అరెస్టు సీఎం చంద్రబాబు, మంత్రి లోకేష్ బరితెగింపు రాజకీయాలకు అద్దం పడుతోందని ఉరవకొండ నియోజకవర్గ సమన్వయకర్త విశ్వేశ్వర రెడ్డి పేర్కొన్నారు. గురువారం స్థానిక పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. నాలుగు నెలల కిత్రమే తాను రాజకీయాలకు దూరంగా ఉంటున్నట్లు పోసాని బహిరంగంగానే ప్రకటించినా ప్రభుత్వం దుర్మార్గంగా అరెస్టు చేయించిందన్నారు. సోషల్ మీడియా పోస్టులు, రాజకీయ విమర్శలకు సెక్షన్ 111 సెక్ష వర్తించదని హైకోర్టు చేసిన వ్యాఖ్యలను సైతం పట్టించుకోకుండా రాజ్యాంగాన్ని అపహాస్యం చేసేలా సీఎం చంద్రబాబు వ్యవహరిస్తున్నారన్నారు. రాష్ట్రంలో చాలా మందిపై ఈ సెక్షన్ నమోదు చేసి బెయిల్ రాకుండా కుతంత్రాలు చేస్తున్నారన్నారు. వైఎస్సార్ సీపీ లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్ రెడ్డి, డైరెక్టర్ ఆఫ్ ప్రాసిక్యూషన్స్‌పైనా కేసు నమోదు చేయడం చూస్తే ఎమర్జెన్సీ పాలన గుర్తుకొస్తోందన్నారు. వైఎస్సార్ సీపీ శ్రేణుల్లో మనోధైర్యాన్ని దెబ్బతీసేలా కూటమి ప్రభుత్వం వ్యవహరిస్తోందని, అందులో భాగంగా లీగల్ సెల్ రాష్ట్ర అధ్యక్షుడు మనోహర్‌రెడ్డిపై కన్‌సెషన్ స్టేట్‌మెంట్ ఆధారం చేసుకుని అక్రమ కేసు బనాయించారన్నారు. ఇటువంటి కేసులకు తాము భయపడమని స్పష్టం చేశారు. సమావేశంలో వైఎస్సార్ సీపీ జిల్లా అధికార ప్రతినిధి సీపీ వీరన్న, లీగల్ సెల్ జిల్లా అధ్యక్షుడు గాజుల ఉమాపతి పాల్గొన్నారు.

రెడ్ బుక్ రాజ్యాంగంలో భాగంగానే పోసాని అరెస్ట్

- మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి



రాప్తాడురూరల్: నారా లోకేష్ రెడ్‌బుక్ రాజ్యాంగం అమలులో భాగంగానే సినీ నటుడు పోసాని కృష్ణమురళి అరెస్ట్ చేశారని రాప్తాడు మాజీ ఎమ్మెల్యే తోపుదుర్తి ప్రకాష్ రెడ్డి ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం ఆయన విలేకరులతో మాట్లాడారు. పోసాని అరెస్ట్‌ను తీవ్రంగా ఖండించారు. అరెస్ట్ చేయడానికి పోలీసులు ఇచ్చిన నోటీసును పరిశీలిస్తే...ఎంత కక్షసాధింపు చర్యలనేది అర్థమవుతుందన్నారు. రేపటి తేదీతో నోటీసు ఇచ్చి ఈరోజే అరెస్ట్ చేసి తీసుకెళ్లారన్నారు. ఇలాంటి పోలీసులు దేశంలోనే చంద్రబాబు ప్రభుత్వంలో తప్ప ఎక్కడా ఉండరన్నారు. పాలసీ మీద పోసాని కృష్ణమురళి విమర్శలు చేశారు తప్ప ఏరోజూ పరిధికి మించి మాట్లాడలేదన్నారు. చంద్రబాబు తప్పిదాలనే ఆయన విమర్శించారన్నారు. అలాంటి వ్యక్తిపై నాన్ బెయిలబుల్ కేసులు బనాయించడం దుర్మార్గమన్నారు. రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు చేసేందుకే అధికారాన్ని ఉపయోగిస్తున్నారని మండిపడ్డారు.చంద్రబాబు, పవన్‌కల్యాణ్‌లతో రాష్ట్రానికి ఒరిగేదేమీలేదన్నారు. 'ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ అసెంబ్లీలో మాట్లాడుతూ ప్రభుత్వంపై విమర్శలు చేసే ప్రతిపక్ష పార్టీ నాయకులను, సోషల్ మీడియాను అణిచివేసేందుకు ఒక తీర్మానం చేయాలని చెప్పారు. ఇందులో భాగంగానే పోసాని అరెస్ట్‌కు కుట్ర జరిగింది' అని ప్రకాష్ రెడ్డి ఆరోపించారు.

ట్రాక్టర్ ఢీ - ఒకరి మృతి


స్వామినాయక్ (ఫైల్)

పెద్దవడుగూరు: ట్రాక్టర్ ఢీకొన్న ఘటనలో ఓ ద్విచక్ర వాహన చోదకుడు దుర్మరణం పాలయ్యాడు. పోలీసులు తెలిపిన మేరకు... గుంతకల్లు మండలం పూలగుట్టపల్లి పెద్దతండాకు చెందిన స్వామి నాయక్ (38) గురువారం ఉదయం ద్విచక్ర వాహనంపై పెద్దపప్పూరు మండలం పుప్పాలతండాలో ఉన్న బంధువుల ఇంటికి బయలుదేరాడు. పెద్దవడుగూరు మండలం తెలికి గ్రామం దాటిన తర్వాత వేగంగా దూసుకొచ్చిన ట్రాక్టర్ ఢీకొంది. ఘటనలో స్వామి నాయక్ అక్కడికక్కడే మృతి చెందాడు. ఆయనకు భార్య మంగమ్మ, ఇద్దరు కుమారులు ఉన్నారు. ఘటనపై కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టినట్లు ఎస్‌ఐ ఆంజనేయులు తెలిపారు.

విద్యార్థిని ఆత్మహత్యాయత్నం

- సోషల్ మీడియాలో అసభ్యకరంగా పోస్టింగ్‌లపై మనస్తాపం

అనంతపురం: ఎస్కేయూ క్యాంపస్‌లో ఓ బీటెక్ విద్యార్థిని గురువారం ఆత్మహత్యాయత్నం చేసింది. ఇటుకలపల్లి సీఐ హేమంత్‌కుమార్ తెలిపిన మేరకు.... ఎస్కేయూలో ఎంఎల్ఐఎస్సీ చదువుతున్న విష్ణువర్దన్ (గార్లదిన్నె మండలం), బీటెక్ విద్యార్థిని స్నేహితులు. విద్యార్థినితో ఉన్న చనువును ఆసరాగా చేసుకుని విష్ణువర్దన్ బ్లాక్‌మెయిల్‌కు తెరలేపాడు. ఆమెతో చనువుగా ఉన్న ఫొటోలను ఫేస్‌బుక్, ఇన్‌స్టాగామ్‌లో అప్‌లోడ్ చేశాడు. విషయం తెలుసుకున్న బీటెక్ విద్యార్థిని గురువారం మనస్తాపానికి గురై చేయి కోసుకుని ఆత్మహత్యాయత్నం చేసింది. తోటి విద్యార్థులు వెంటనే అప్రమత్తమై చికిత్స చేయించడంతో ప్రాణాపాయం తప్పింది. విద్యార్థిని తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు ఇటుకలపల్లి పోలీసులు కేసు నమోదు చేసి, నిందితుడు విష్ణువర్దన్ కోసం గాలిస్తున్నారు.

వసతి గృహం తనిఖీ : ఎస్కేయూ మహిళా వసతి గృహాన్ని ఎస్కేయూ ఇన్‌చార్జ్ వీసీ ప్రొఫెసర్ బి.అనిత, రిజిస్ట్రార్ రమేష్ బాబు, సీఐ హేమంత్ కుమార్ సందర్శించారు. విద్యార్థినులతో సమావేశం నిర్వహించారు. తల్లిదండ్రులు మిమ్మల్ని ఇక్కడికి పంపిస్తే.. క్రమశిక్షణ రాహిత్యంగా ఉండడం భావ్యం కాదని హితవు పలికారు. సాయంత్రం 6 గంటల తర్వాత ఎవరూ బయటకు వెళ్లడానికి వీల్లేదని హెచ్చరించారు. బుద్ధిగా చదువుకుని ఉన్నత స్థానాలకు చేరుకోవాలన్నారు. కాగా, ఇంజినీరింగ్, ఫార్మసీ విద్యార్థినుల హాస్టళ్లకు డిప్యూటీ వార్డెన్‌లుగా ఇతర విభాగాల్లోని వారిని కేటాయించారు. ఇప్పటికైనా డిప్యూటీ వార్డెన్లుగా ఇంజినీరింగ్, ఫార్మసీ మహిళా అధ్యాపకులను నియమిస్తే పర్యవేక్షణ బాగా ఉంటుందని అభిప్రాయాలు ఈ సందర్భంగా వ్యక్తమయ్యాయి.

క్వింటా చింతపండు రూ.30 వేలు

హిందూపురం అర్బన్: క్వింటా చింతపండు గరిష్టంగా రూ.30 వేలు పలికింది. స్థానిక వ్యవసాయ మార్కెట్‌కు గురువారం 950 క్వింటాళ్ల చింతపండు రాగా, అధికారులు ఈ–నామ్ పద్ధతిలో వేలం పాటలు నిర్వహించారు. ఇందులో కలిపురి రకం క్వింటా గరిష్టంగా రూ.30 వేలు, కనిష్టంగా రూ.8 వేలు, సగటున రూ.12 వేలు పలికింది. అలాగే ఫ్లవర్ రకం క్వింటా గరిష్టంగా రూ.13 వేలు, కనిష్టంగా రూ.4,300, సగటున రూ. 6 వేల ప్రకారం ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి జి. చంద్రమౌళి తెలిపారు. ఇక బోటు రకం చింతపండు క్వింటా గరిష్టంగా రూ.4 వేలు, కనిష్టంగా రూ.3500 పలికింది.

చోరీ కేసుల్లో ముద్దాయికి మూడేళ్ల జైలు

పుట్టపర్తి టౌన్: పలు బంగారు ఆభరణాల అపహరణ కేసుల్లో ముద్దాయి అమర్నాథ్‌నాయుడుకు మూడేళ్ల సాధారణ జైలు శిక్ష విధిస్తూ పుట్టపర్తి జేఎఫ్‌సీఎం కోర్టు గురువారం తీర్పు వెలువరించింది. వివరాల్లోకి వెళితే.. జిల్లాలోని నల్లమాడ ప్రాంతంలో భీమినేని అమర్నాథ్‌నాయుడు 14 చోరీలకు పాల్పడ్డాడు. 2021 డిసెంబర్ 22న సీఐ ఇస్మాయిల్ 650 గ్రాముల బంగారాన్ని రికవరీ చేయడంతో పాటు ముద్దాయిని రిమాండ్‌కు తరలించారు. కేసులకు సంబంధించిన సాక్ష్యాలను పకడ్బందీగా కోర్టుకు సమర్పించారు. పోలీస్ వారి తరుపున ఏపీపీలు నగేష్, రాజేంద్రప్రసాద్ వాదనలు వినిపించారు. నేరం రుజువు కావడంతో ముద్దాయి అమర్నాథ్‌నాయుడుకు మూడు సంవత్సరాల సాధారణ జైలు శిక్ష విధిస్తూ న్యాయమూర్తి రాకేష్ తీర్పు వెల్లడించారు. బాధితులకు న్యాయం జరిగేలా దర్యాప్తు చేపట్టిన సీఐ ఇస్మాయిల్‌ను, కోర్టు కానిస్టేబుల్ కృష్ణమాచారి, చంద్రానాయక్‌ను ఉన్నతాధికారులు ప్రశంసించారు.

భక్త జనసంద్రమైన 'కోన క్షేత్రం'


కోన క్షేత్రంలో రథాన్ని లాగుతున్న దృశ్యం

యాడికి: మహాశివరాత్రి సందర్భంగా యాడికి మండలం కోనుప్పలపాడు సమీపంలోని కోన క్షేత్రంలో వెలసిన రామలింగేశ్వరుడి రథోత్సవం గురువారం సాయంత్రం నేత్రపర్వంగా సాగింది. జిల్లా వాసులతో పాటు నంద్యాల జిల్లా నుంచి భక్తులు పెద్ద సంఖ్యలో తరలిరావడంతో కోన క్షేత్రం కిక్కిరిసింది. గ్రామ పెద్దలు రామాంజనేయులు, రామకృష్ణ, పంచాయతీ అధికారులు భక్తులకు తగిన ఏర్పాట్లు చేశారు. సాయంత్రం ఆలయ అర్చకుడు జంగం రాజశేఖరయ్య ఆధ్వర్యంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులను రథంపై అధిష్ఠింపజేసి, మర్రిమాను చివరి వరకు లాగారు. కాగా, గురువారం వేకువజామున ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. అలాగే శివరాత్రి సందర్భంగా యాడికి మండల వ్యాప్తంగా ఆలయాల్లో భక్తులు జాగారణతో మొక్కులు తీర్చుకున్నారు. యాడికిలోని భైరవేశ్వర ఆలయంలో శివపార్వతుల ఉత్సవ మూర్తులకు ఎంపీపీ బొంబాయి ఉమాదేవి, బొంబాయి రమేష్ నాయుడు కల్యాణం జరిపించారు.

వైభవంగా ఎణ్ణెరంగనాథేశ్వరస్వామి రథోత్సవం


రథోత్సవంలో పాల్గొన్న భక్తులు

బొమ్మనహాళ్: మండలంలోని గోవిందవాడ గ్రామంలో వెలసిన ఎణ్ణెరంగనాథేశ్వరస్వామి (యన్నప్ప తాత) రథోత్సవం గురువారం సాయంత్రం వైభవంగా సాగింది. అంతకు ముందు ఆలయంలో విశేష పూజలు నిర్వహించారు. సాయంకాలం 6.30 గంటలకు ఉత్సవ మూర్తిని రథంపై అధిష్ఠంపజేసి, గోవింద నామస్మరణతో భక్తులు ముందుకు లాగారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు, గోవిందవాడ గ్రామ పెద్దలు, పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

ఆటో డ్రైవర్ల సమస్యలు పరిష్కరించాలి



డీటీసీ వీర్రాజుతో చర్చిస్తున్న ఆటో డ్రైవర్స్ యూనియన్ నాయకులు

అనంతపురం సెంట్రల్: నగరంలో ఆటో డ్రైవర్లు ఎదుర్కొంటున్న సమస్యలను వెంటనే పరిష్కరించాలని భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ (సీఐటీయూ) నాయకులు డిమాండ్ చేశారు. గురువారం ఉప రవాణా కమిషనర్ వీర్రాజును ఆయన చాంబర్‌లో కలిసి సమస్యలపై చర్చించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నగర కార్యదర్శులు వెంకటనారాయణ, ముత్తూజా మాట్లాడుతూ.. ఇటీవల కాలంలో రాపిడోతో పాటు ప్రైవేటు ఫైనాన్స్ కంపెనీల ద్వారా ఆటో డ్రైవర్లు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే వాటిని రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ బ్యాంకులో రుణాలు ఇప్పించాలని కోరారు. ఆర్టీఏలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు జారీ ప్రైవేటు సంస్థకు కాకుండా ప్రభుత్వమే కొనసాగించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో భగత్‌సింగ్ ఆటో డ్రైవర్స్ యూనియన్ నగర కార్యదర్శులు శ్రీనివాసులు, ఆదినారాయణ, అధ్యక్షులు నాగరాజు, బాషా, పలువురు కమిటీ సభ్యులు, ప్రజా సంఘాల నాయకులు, ఆటో డ్రైవర్లు పాల్గొన్నారు.

నేడు ఉమర్ ఆలీషా రాష్ట్రస్థాయి జయంతి



మాట్లాడుతున్న గాజుల పద్మజ

అనంతపురం కల్చరల్: అనంత వేదికగా శుక్రవారం జరగనున్న డాక్టర్ ఉమర్ ఆలీషా రాష్ట్రస్థాయి జయంతిని జయప్రదం చేయాలని లలిత కళాపరిషత్తు కార్యదర్శి సీనియర్ న్యాయవాది గాజుల పద్మజ కోరారు. గురువారం లలిత కళాపరిషత్తులో సదస్సు నిర్వాహకులతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ప్రతిసారి పిఠాపురం, భీమవరం, బెంగళూరు, హైదరాబాద్ ప్రాంతాల్లో జరిగే రాష్ట్రస్థాయి వేడుకలు ఈసారి నగరంలోని లలిత కళాపరిత్తులో జరుగుతున్నందున సాహితీ అభిమానులందరూ తరలిరావాలని కోరారు. నిర్వాహకులు రియాజుద్దీన్, చింతా వేంకటేశ్వర్లు, చెట్ల ఈరన్న, తోటనాగరాజు, సుంకర రమేష్ మాట్లాడుతూ.. పీఠం నవమ పీఠాధిపతులు డాక్టర్ ఉమర్ ఆలీషా సద్గురువులతో పాటూ ఆచార్య రాచపాలెం చంద్రశేఖరరెడ్డి, సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ, డాక్టర్ జగర్లపూడి శ్యామసుందరశాస్త్రి విశిష్ట అతిథులుగా విచ్చేస్తారన్నారు. 'భారతదేశం–మతసామరస్యం' అనే సదస్సులో ప్రసంగిస్తారన్నారు.

పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్



నినాదాలు చేస్తున్న ఏఐడీఎస్‌ఓ నాయకులు

అనంతపురం ఎడ్యుకేషన్: రాజీలేని స్వాతంత్య్ర పోరాట యోధుడు చంద్రశేఖర్ ఆజాద్ అని ఆలిండియా డెమోక్రటిక్ స్టూడెంట్స్ ఆర్గనైజేషన్ (ఏఐడీఎస్‌ఓ) నాయకులు కొనియాడారు. గురువారం స్థానిక టవర్ క్లాక్ వద్ద చంద్రశేఖర్ ఆజాద్ వర్ధంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఏఐడీఎస్‌ఓ నగర అధ్యక్షుడు చరణ్ రాజ్, కార్యదర్శి చరణ్ తేజ్ మాట్లాడుతూ.. చంద్రశేఖర్ ఆజాద్ కలలుకన్న దోపిడీ లేని సమాజం ఇంకా రాలేదన్నారు. విద్య వ్యాపారీకరణ, నిరుద్యోగం, ధరల పెరుగుదల, పసిపిల్లలు, అమ్మాయిలపై అత్యాచారాలు వంటి సమస్యలు పెరుగుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. యువతలో నైతిక విలువలు పతనం కావడానికి, అత్యాచారాలకు మూల కారణం అశ్లీలత, మత్తుపదార్థాలు, మద్యం మాదకద్రవ్యాలే కారణమన్నారు. వీటిని ప్రభుత్వాలు అరికట్టాలని డిమాండ్ చేశారు. చంద్రశేఖర్ ఆజాద్, భగత్ సింగ్, అల్లూరి, నేతాజీ పోరాటల స్ఫూర్తితో విద్యార్థులు, యువకులు ప్రజా వ్యతిరేక విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ఏఐడీఎస్‌ఓ రాష్ట్ర కార్యదర్శి మహేష్, జిల్లా నాయకులు సురేష్, ఎం.మహేష్ బాబు, మహమ్మద్, చంద్రిమ, నాని తదితరులు పాల్గొన్నారు.



గోరంట్లకు చెందిన సరస్వతి బిడ్డ (నెలల పసికందు) గురువారం తీవ్ర అనారోగ్యానికి గురైంది. తల్లి సరస్వతి బోరున కేకలు వేసింది. దీంతో ఆ వార్డుల్లోని తల్లిదండ్రులు, పిల్లలు ఒక్కసారిగా ఉలిక్కిపడ్డారు. ఎంతసేపటికి చిన్న పిల్లల వైద్య నిపుణులు అటువైపు రాలేదు. అక్కడే ఉన్న పీజీ వైద్య విద్యార్థులు పసికందును చూడాల్సి వచ్చింది. ఇలా సర్వజనాస్పత్రిలో ఒక్క చిన్నపిల్లల వార్డు మాత్రమే కాదు మెడిసిన్, సర్జరీ, ఆర్థో, పల్మనాలజీ, ఈఎన్‌టీ, తదితర వార్డుల్లో వైద్యులు పత్తా లేకుండా పోతున్నారు.

ప్రాణాపాయ స్థితిలో ఉన్న తన బిడ్డను బతికించాలంటూ ఏడుస్తున్న గోరంట్లకు చెందిన సరస్వతి, సేవలందిస్తున్న పీజీ వైద్య విద్యార్థులు (చిత్రంలో కన్పించని రెగ్యులర్ వైద్యులు)

వైద్యులు కనిపిస్తే ఒట్టు..!

- వార్డుల్లో ఖాళీగా కనిపిస్తున్న కుర్చీలు
- పీజీలకు వదిలేసి వెళ్తున్న అసిస్టెంట్ ప్రొఫెసర్లు
- చిన్నారుల ఆరోగ్యంతో ఆటలు
- చోద్యం చూస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్



చిన్నపిల్లల ఐసీయూలో ఖాళీగా ఉన్న వైద్యుల కుర్చీలు

అనంతపురం మెడికల్: ప్రభుత్వ సర్వజనాస్పత్రిలో వైద్యం దైవాదీనంగా మారింది. రూ.లక్షల్లో జీతం తీసుకునే వైద్యులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారు. ప్రధానంగా సర్వజనాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డుకు మెడిసిన్ అసిస్టెంట్ ప్రొఫెసర్లు గైర్హాజరవుతున్నారు. అక్యూట్ మెడికల్ కేర్ (ఏఎంసీ)లో ఉంటున్నామని చెబుతున్నా.. అది మాటలకే పరిమితం అవుతోంది. అక్కడ పీజీ వైద్యులను ఉంచి రెగ్యులర్ వైద్యులు విధులను నిర్లక్ష్యం చేస్తున్నారు. గతంలో సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు తనిఖీలో వైద్యుల నిర్లక్ష్యం కన్పించింది. మెమోలు జారీ చేసినప్పటికీ వైద్యులు లెక్క చేయడం లేదు. వీరికి చార్జ్ మెమోలు జారీ చేయాల్సి ఉందని ఆస్పత్రి వర్గాలు చెబుతున్నాయి. ప్రభుత్వ సర్వజనాస్పత్రికి రోజూ 2,500 నుంచి 3,000 ఓపీ, 1,200 మంది ఔట్ పేషంట్లు సేవలు పొందుతుంటారు. మెడిసిన్‌కు సంబంధించి ఎఫ్ ఎం, ఎంఎం, ఐసీయూ, సర్జరీకి సంబంధించి ఎంఎస్, ఎఫ్ఎస్, బర్న్స్ వార్డు, ఈఎన్‌టీ, పల్మనాలజీ, చిన్నపిల్లల విభాగానికి సంబంధించి వివిధ యూనిట్లు, ఎస్ఎన్‌సీయూ, ఎన్ఆర్‌సీ, తదితర వార్డుల్లో మధ్యాహ్నం, రాత్రి వేళల్లో వైద్యులు కనిపించరు. జిల్లా కలెక్టర్ డాక్టర్ వినోద్‌కుమార్ వైద్యుల పనితీరు పట్ల సర్వజనాస్పత్రిని ఆకస్మిక తనిఖీ చేస్తే అసలు విషయం వెలుగులోకి వస్తుంది.

రూ.లక్షల్లో జీతాలు

అసిస్టెంట్, అసోసియేట్, ప్రొఫెసర్లు రూ.లక్షల్లో జీతాలు తీసుకుంటూ వారి ప్రైవేట్ ప్రాక్టీస్‌పై ప్రత్యేక శ్రద్ధ చూపిస్తున్నారన్న విమర్శలు వినిపిస్తున్నాయి. సందు దొరికితే చాలు తమ క్లినిక్‌లకు వెళ్లి పోయి పనిలో నిమగ్నమవుతున్నారు. గతంలో సర్జరీ విభాగానికి సంబంధించి అసిస్టెంట్ ప్రొఫెసర్ వెంకటరమణ నాయక్ నిబంధనలకు విరుద్ధంగా ఆస్పత్రిని వదిలి ఇక్కడ పేషంట్‌ను తన క్లినిక్‌కి తరలించాడు. చివరకు పేషంట్ ప్రాణం మీదకు వచ్చినా.. ఇంత వరకు అతనిపై ఎటువంటి చర్యలు తీసుకున్న దాఖలాలు లేవు. ఇలా పదుల సంఖ్యలో వైద్యులు ఆస్పత్రి విధులకు దూరంగా ఉంటూ రోగుల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారు.

చర్యలు శూన్యం..

వైద్యులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్న జీజీహెచ్ సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు చోద్యం చూస్తున్నారు. ఉదయం, మధ్యాహ్నం, సాయంత్రం అతను మాత్రం సమయపాలన పాటించడం. ఇక మిగతా వారితో తనకేం పట్టదన్న ధోరణితో ఆస్పత్రిలోని తన గదికే ఆయన పరిమితమవుతున్నారు. ఇక ఆర్ఎంఒల గురించి చెప్పాల్సిన పని లేదు. ఇప్పటికైనా జిల్లా కలెక్టర్ చొరవ తీసుకుని ప్రజలకు భరోసా వైద్యాన్ని అందించేలా చూస్తారో లేదో చూడాలి.

అప్పుడే చెప్పింటే బాగుండే



చిన్నపిల్లల వార్డుల్లో వైద్యులు లేరన్న విషయం అప్పుడే చెప్పింటే బాగుండేది. ఏడెనిమిది మంది వైద్యులుంటారు. వారిలో ఎవరో ఒకరిని పంపి వైద్యం అందించే వాళ్లం. వైద్యులు అందుబాటులో లేని విషయంపై ఆరా తీస్తాం. ఎవరైనా విధులకు గైర్హాజరైనట్లు తెలిస్తే ఉపేక్షించేది లేదు. మరోసారి ఇలాంటి పరిస్థితి తలెత్తకుండా చర్యలు తీసుకుంటాం.

– డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, సూపరింటెండెంట్, జీజీహెచ్

ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం



పోలీస్ అధికారులతో మాట్లాడుతున్న రైల్వే స్టేషన్ మేనేజర్ అశోక్‌కుమార్

అనంతపురం సిటీ: ప్రయాణికుల భద్రతతో పాటు రైల్వే ఆస్తుల పరిరక్షణకు మరింత సమన్వయంతో పని చేద్దామని అనంతపురం రైల్వే స్టేషన్ మేనేజర్ మాసినేని అశోక్ కుమార్ అన్నారు. జీఆర్పీ ఎస్ఐ వెంకటేశ్వర్లు, ఆర్పీఎఫ్ ఎస్ఐ మధుకరాచారి, ఆయా విభాగాల సిబ్బందితో గురువారం తన చాంబర్‌లో సమావేశమయ్యారు. ఇటీవల జరిగిన పరిణామాలు, ఘటనలపై సమీక్షించారు. అమృత్ భారత్‌లో భాగంగా ఇక్కడి రైల్వే స్టేషన్‌ను రూ.9.29 కోట్లతో విస్తరిస్తున్న నేపథ్యంలో ప్రయాణికులతో పాటు రైళ్ల రాకపోకల సంఖ్య మరింత పెరగనున్నట్లు చెప్పారు. దీంతో నేరాలు పెరగకుండా నియంత్రించాల్సిన బాధ్యత అందరిపై ఉందన్నారు. ప్రయాణికుల భద్రతకు ప్రాధాన్యం ఇవ్వాలని పేర్కొన్నారు. స్టేషన్ సహా పరిసర ప్రాంతాల్లో అనుమానాస్పద వ్యక్తుల కదలికలపై ఎప్పటికప్పుడు నిఘా పెట్టాలన్నారు. ముఖ్యంగా మహిళలు, చిన్న పిల్లల విషయంలో మరింత అప్రమత్తమంగా ఉండాలని సూచించారు. వందేభారత్ రైళ్లపై తరచూ రాళ్ల దాడులు జరుగుతున్న నేపథ్యంలో రెండు శాఖల వారు మరింత దృష్టి సారించాలని పేర్కొన్నారు. అందుకు తమ వంతు సహకారం అందిస్తామని తెలిపారు.

పోసాని అరెస్టు అక్రమం





విలేకరులతో మాట్లాడుతున్న మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య

అనంతపురం కార్పొరేషన్: సినీ నటుడు పోసాని మురళీ అరెస్టు అక్రమం. కూటమి ప్రభుత్వ వైఫల్యాలను ప్రశ్నిసే వారి గొంతునొక్కే భాగంలోనే అరెస్టులకు పాల్పడుతున్నారని మేయర్ వసీం, డిప్యూటీ మేయర్ వాసంతి సాహిత్య ఆగ్రహం వ్యక్తం చేశారు. గురువారం వారు వేర్వేరుగా విలేకరులతో మాట్లాడారు. అనారోగ్యంతో బాధపడుతున్న పోసాని కృష్ణ మురళీని బుధవారం రాత్రికి రాత్రి పోలీసులు అరెస్టు చేసిన తీరు చూస్తే రాష్ట్రంలో రెడ్‌బుక్ రాజ్యాంగం అమలు అవుతోందని స్పష్టంగా తెలుస్తోందన్నారు. మొన్న వల్లభనేని వంశీ, నేడు పోసాని అరెస్టు అందుకు నిలువెత్తు సాక్ష్యమన్నారు. రానున్న రోజుల్లో కూటమి ప్రభుత్వానికి ప్రజలు తప్పక బుద్ధి చెబుతారని తెలిపారు. ప్రజా వ్యతిరేక విధానాలను అవలంబిస్తున్న కూటమి ప్రభుత్వానికి భంగపాటు తప్పదని హెచ్చరించారు. అధికారాన్ని అడ్డం పెట్టుకుని సినీ నటుడు పోసాని కృష్ణ మురళీని అరెస్టు చేశారన్నారు. ఇది ముమ్మాటికీ కక్ష సాధింపు చర్య. వైఎస్సార్‌సీపీ శ్రేణులను లక్ష్యంగా చేసుకుని కూటమి ప్రభుత్వం రాజ్యాంగ విలువలను హరిస్తోందని పేర్కొన్నారు. కూటమి ప్రభుత్వం రానున్న రోజుల్లో తీవ్ర పరిణామాలు ఎదుర్కోక తప్పదన్నారు.

మద్యం మత్తులో హల్‌చల్..



విద్యుత్ స్తంభంపై కూర్చొన్న శివ



శివ కోసం పైకి ఎక్కుతున్న స్థానికుడు



శివను క్షేమంగా కిందకు తీసుకొచ్చిన దృశ్యం

తపోవనం సర్కిల్‌లో గురువారం సాయంత్రం ఓ వ్యక్తి మద్యం మత్తులో విద్యుత్ స్తంభం ఎక్కి హల్‌చల్ చేశాడు. స్థానికంగా ఓ హోటల్‌లో పని చేస్తున్న శివ తన తల్లితో గొడవపడ్డాడు. కోపంతో తపోవనం సర్కిల్‌కు వచ్చి విద్యుత్ స్తంభం ఎక్కి కూర్చొన్నాడు. గమనించిన స్థానికులు, స్నేహితులు ఎంత చెప్పినా కిందకు రాలేదు. చివరికి పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఘటన స్థలానికి చేరుకున్న పోలీసులు పలువురి సహాయంతో విద్యుత్ స్తంభంపై ఉన్న శివను క్షేమంగా కిందకి తీసుకొచ్చారు.

– సాక్షి ఫొటోగ్రాఫర్, అనంతపురం:

విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించం



సూచనలిస్తున్న కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్

అనంతపురం మెడికల్: రోగులకు ఇబ్బందులు తలెత్తకుండా మందులను అందుబాటులో ఉంచుకోవాలని కలెక్టర్ డాక్టర్ వినోద్ కుమార్ పేర్కొన్నారు. గురువారం శారదా నగర్‌లోని సెంట్రల్ డ్రగ్ స్టోర్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. మందుల నిల్వలను పరిశీలించిన అనంతరం సంబంధిత అధికారులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ.. ప్రభుత్వ ఆస్పత్రులకు అవసరమైన మందుల సరఫరాలో ఎలాంటి లోటు ఉండరాదన్నారు. ఎప్పటికప్పుడు ఆన్‌లైన్ ఇండెంట్ పెట్టుకోవాలన్నారు. జిల్లాలో ఉన్న ప్రతి ఒక్క ఫార్మసిస్టులతో వాట్సాప్ గ్రూపు ఏర్పాటు చేయాలని సూచించారు. వైద్య ఆరోగ్యశాఖాధికారులు రోజూ ఇండెంట్‌ను తనిఖీ చేయాలన్నారు. ఫార్మసిస్టులు విధుల్లో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే ఉపేక్షించేది లేదన్నారు. సర్వజనాస్పత్రిలో ఉన్న 22 మంది ఫార్మసిస్టుల్లో కొందరిని సూపర్ స్పెషాలిటీ ఆస్పత్రికి పంపాలన్నారు. ఆన్‌లైన్‌లో 740 రకాల మందులు ఉన్నాయని తెలిపారు. ప్రజలకు అవసరమైన మందులు అందుబాటులోకి తీసుకువచ్చే బాధ్యత ఫార్మసిస్టులు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో డీఎంహెచ్ఓ డాక్టర్ భ్రమరాంబ దేవి, డ్రగ్ ఏడీ రమేష్‌రెడ్డి, డీసీహెచ్ఎస్ డాక్టర్ పాల్ రవికుమార్, సూపరింటెండెంట్ డాక్టర్ కేఎస్ఎస్ వెంకటేశ్వర రావు, ఈఈ శ్రీనివాసులు నాయుడు పాల్గొన్నారు.

చికిత్స పొందుతూ లెక్చరర్ మృతి

అనంతపురం: నగరంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ ప్రైవేట్ కళాశాల లెక్చరర్ తీవ్రంగా గాయపడ్డాడు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందాడు. రాం నగర్‌లో నివాసం ఉంటున్న మనోహర్ (61) బుధవారం రాత్రి 11 గంటల సమయంలో వ్యక్తిగత పని నిమిత్తం తపోవనం కూడలి నుంచి టీటీడీ వైపు ద్విచక్ర వాహనంపై వెళ్లారు. వెనుక వైపు నుంచి బొలెరో వాహనం వేగంగా వచ్చి ఢీ కొట్టింది. ఈ ప్రమాదంలో మనోహర్ తీవ్రంగా గాయపడ్డారు. స్థానికులు చికిత్స నిమిత్తం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ మృతి చెందాడు.

తప్పిపోయిన బాలిక అప్పగింత

అనంతపురం: తప్పిపోయిన బాలికను గంటలో వెతికి తల్లిదండ్రులకు అప్పగిచారు వన్‌టౌన్ పోలీసులు. వివరాలు.. గురువారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో తన కూతురు స్కూల్‌కు వెళ్లి కనిపించడం లేదని బాలిక తండ్రి వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. శారదా నగర్‌లో ప్లే స్కూల్‌లో చదువుతున్న బాలిక దుకాణానికి వెళ్లి తప్పిపోయింది. సీఐ రాజేంద్రనాథ్ యాదవ్ టీంలను ఏర్పాటు చేసి బాలిక కోసం గాలించారు. శారదా నగర్ దాటిపోయి వీధి చివరన ఉన్న బాలికను తీసుకొచ్చి తల్లిదండ్రులకు అప్పగించారు.

స్వచ్ఛంద సేవకుల సేవలు అమోఘం

అనంతపురం కల్చరల్: సమాజానికి ఏ అవసరమొచ్చినా ఆదుకునేందుకు సిద్ధంగా ఉండేది స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులే అని ఆశ్రయ అనాథాశ్రమం వ్యవస్థాపకుడు ఎర్రగుంట కృష్ణారెడ్డి అన్నారు. గురువారం కమలానగర్‌లో గీతాంజలి ప్రాంగణంలో 'ప్రపంచ స్వచ్ఛంద సంస్థల దినోత్సవం' నిర్వహించారు. జిల్లాలోని పలు స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు. ఈ సందర్భంగా కృష్ణారెడ్డి, ఫైట్ ఫర్ రైట్స్ సంస్థ అధ్యక్షుడు కేపీ రాజు, తెలుగు వెలుగు సాహితీ సంస్థ టీపీరెడ్డి, ఎన్‌కేసీ సేవా సంస్థ కమల్‌నాథ్ తదితరులు మాట్లాడారు. రక్తం పంచుకున్న పిల్లలు కూడా డబ్బు, హోదా వచ్చిన తర్వాత సొంతవారినే వదిలేస్తున్నారని తెలిపారు. మానవత్వంతో స్వచ్ఛంద సంస్థల ప్రతినిధులు ఆశ్రయం, అవసరాలు తీరుస్తున్నారని గుర్తు చేశారు. కార్యక్రమంలో సీనియర్ రచయిత డాక్టర్ పతికి రమేష్ నారాయణ తోటనాగరాజు, లింగాల పవన్, సోలార్ రమేష్, సుధాకర రాజు పాల్గొన్నారు.

వక్ఫ్‌బోర్డు ఆస్తులు రక్షించకపోతే ఉద్యమమే



మాట్లాడుతున్న ఐఎంఎం నాయకులు

అనంతపురం కల్చరల్: వక్ఫ్‌బోర్డు ఆస్తులు రక్షించకపోతే ఉద్యమిస్తామని ఐఎంఎం రాష్ట్ర అధ్యక్షుడు మహబూబ్ బాషా అన్నారు. గురువారం ఆ సంఘం కార్యాలయంలో వక్ఫ్‌బోర్డు ఆస్తుల అన్యాక్రాంతంపై ఐఎంఎం ప్రతినిధులు విలేకరులతో మాట్లాడారు. వితంతువుల విద్యాభివృద్ధి, మసీదులు, దర్గాల, కబరస్థాన్ అభివృద్ధికి మాత్రమే వక్ఫ్‌బోర్డు ఆదాయాన్ని వినియోగించాలన్నారు. ప్రభుత్వ ఉదాసీనత వల్ల ఇష్టారాజ్యంగా మారిపోతోందని ఆందోళన వ్యక్తం చేశారు. వక్ఫ్‌బోర్డు పరిరక్షకులుగా నియమిస్తున్న వ్యక్తులు స్వార్థంతో సొంత ఆస్తులను కూడబెట్టుకోవడంతోనే సరిపోతోందన్నారు. మోసగాళ్ల చేతుల్లో ఆక్రమణకు గురవుతున్న వాటిని వెంటనే పరిరక్షించాలని డిమాండ్ చేశారు. డోనర్ల ద్వారా సేవా కార్యక్రమాలు చేస్తున్నట్లు నమ్మిస్తూ భారీగా విరాళాలు సేకరిస్తున్నారని విమర్శించారు. ప్రభుత్వం ముస్లింల సమస్యలను పరిష్కరించకపోతే ధర్నాలు, నిరసనలు చేస్తామని హెచ్చరించారు. కార్యక్రమంలో మైనార్టీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.

బీడీ కార్మికుల వేతనాల పెంపునకు వినతి

అనంతపురం సిటీ: జిల్లా వ్యాప్తంగా బీడీ కార్మికులు శ్రమ దోపిడీకి గురవుతున్నారు. వారి కష్టానికి తగ్గ ఫలితం దక్కేలా చూడాలని ఏపీ బీడీ, సిగార్ వర్కర్స్ యూనియన్ ప్రతినిధులు కోరారు. గురువారం అనంతపురంలోని కార్మిక శాఖ కార్యాలయంలో ఆ శాఖ అధికారులను కలసి వినతి పత్రం అందజేశారు. వెయ్యి బీడీలు చుడితే కేవలం రూ.200 మాత్రమే ఇస్తుండటంతో కార్మికులు తీవ్రంగా నష్టపోతున్నారని అందులో పేర్కొన్నారు. వెయ్యి బీడీలకు రూ.300 ధర పెంచాలని కోరారు. దీనిపై కార్మిక శాఖ అధికారులు స్పందిస్తూ.. పరిశీలించి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఓబులు, నాగేంద్ర, ఉమాగౌడ్ పాల్గొన్నారు.

ఖాళీల భర్తీకి చర్యలు తీసుకోండి

అనంతపురం అర్బన్: ప్రభుత్వ శాఖల్లో ఖాళీగా ఉన్న ఆఫీసు సబార్డినేట్ (ఓఎస్) పోస్టుల భర్తీకి చర్యలు తీసుకోవాలని కలెక్టర్ వి.వినోద్ కుమార్‌కు ఏపీఎన్‌జీఓ నాయకులు విన్నవించారు. గురువారం కలెక్టర్‌ను ఆయన చాంబర్ వద్ద సంఘం జిల్లా అధ్యక్షుడు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యదర్శి చంద్రమోహన్, గౌరవాధ్యక్షుడు కుళ్లాయప్ప, తదితర నాయకులు కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. ఏపీజీఎల్ఐ కార్యాలయంలో ఖాళీగా ఉన్న ఆఫీసు సబార్డినేట్ పోస్టులను కారుణ్య నియామకం ద్వారా భర్తీకి చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా ఇతర శాఖల్లోని ఖాళీలను భర్తీ చేయాలని విన్నవించారు. కలెక్టర్ సానుకూలంగా స్పందిస్తూ ఖాళీల భర్తీకి చర్యలు తీసుకుంటామని చెప్పారు. కార్యక్రమంలో ఏపీ ప్రభుత్వ నాల్గవ తరగతి ఉద్యోగుల కేంద్ర సంఘం రాష్ట్ర ప్రచార కార్యదర్శి ముక్తియార్ అహమ్మద్, జిల్లా అధ్యక్షుడు గౌస్‌పీరా, కార్యదర్శి పెద్దన్న, ఉపాధ్యక్షుడు భాస్కర్, కోశాధికారి వాజిద్‌బాషా, నాయకులు షేక్షావలి, నాగభూషణం, కిరణ్‌కుమార్, ప్రకాశ్, స్వర్ణలత పాల్గొన్నారు.

ఆకట్టుకున్న వైజ్ఞానిక ప్రదర్శన



ప్రాజెక్టులను పరిశీలిస్తున్న శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి

అనంతపురం ఎడ్యుకేషన్: స్థానిక హౌసింగ్ బోర్డులోని శ్రీ చైతన్య బాలికల రెసిడెన్షియల్ పాఠశాలలో గురువారం సైన్స్ ఎక్స్‌పో (వైజ్ఞానిక ప్రదర్శన) నిర్వహించారు. శ్రీచైతన్య పాఠశాలల ఏజీఎం సుబ్బారెడ్డి మాట్లాడుతూ.. సాంకేతిక, వైజ్ఞానిక అంశాలపై విద్యార్థి దశనుంచే ఆసక్తి కనబరచాలని సూచించారు. విద్యార్థుల్లో సృజనాత్మకతను పెంపొందించేందుకు ఇలాంటి వైజ్ఞానిక ప్రదర్శనలు ఉపయోగపడతాయన్నారు. విద్యార్థులు 200 రకాల నమూనాలు ప్రదర్శించారు. పలు ప్రాజెక్ట్‌లు విద్యార్థుల మేధస్సుకు అద్దం పట్టాయి. విజేతులగా నిలిచిన విద్యార్థులకు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ సమీనా ఖాన్, జోనల్ కో–ఆర్డినేటర్ రాధాకృష్ణ, డీన్ సత్యనారాయణ, సీ–బ్యాచ్ ఇన్‌చార్జ్ చంద్రమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

కనుల పండువగా రథోత్సవం



పూజలు చేస్తున్న అర్చకులు

అనంతపురం కల్చరల్: వారం రోజులుగా మొదటి రోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో సాగుతున్న మహాశివ రాత్రి ఉత్సవాల్లో భాగంగా గురువారం ఉదయం ఆలయంలో రథాంగ హోమం, మడుగుతేరును భక్తి శ్రద్ధలతో నిర్వహించారు. సాయంత్రం దీక్షా హోమం అనంతరం భవానీ శంకరులను రథంలో కొలువుదీర్చారు. మొదటి, రెండో రోడ్ల మీదుగా విశేష పుష్పాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. వందల సంఖ్యలో తరలి వచ్చిన భక్తులు వివిధ కళారూపాలను అద్భుతంగా ప్రదర్శిస్తూ ఆకట్టుకున్నారు. జాగరణోత్సవం ముగింపు సందర్భంగా నాలుగో రోడ్డులోని రామలింగేశ్వరస్వామి ఆలయంలో శివపార్వతుల కల్యాణోత్సవం కమనీయంగా సాగింది. రాత్రి ఊరేగింపు, మెరవణి నిర్వహించారు.

ఉన్నత లక్ష్యంతో మంచి ఫలితాలు

అనంతపురం మెడికల్: శిల నీవే.. శిల్పం నీవే. నీలో దాగి ఉన్న శిల్పాన్ని సరైన మార్గంలో తీసుకెళ్లి మంచి శిల్పంగా మలుచుకోవాలని మోటివేషనల్ స్పీకర్ డాక్టర్ గూడపాటి దయాకర రావు పేర్కొన్నారు. గురువారం ప్రభుత్వ వైద్య కళాశాలలో మెడికోలు, పీజీ విద్యార్థులకు పాజిటివ్ యాటిట్యూడ్, కమ్యూనికేషన్ స్కిల్స్, పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ప్రస్తుత పోటీ ప్రపంచంలో విద్యార్థులు సామాజిక మాధ్యమాలపై దృష్టి సారించి, కెరియర్‌ను నిర్లక్ష్యం చేస్తున్నారన్నారు. ప్రతి ఒక్కరూ ఉన్నత లక్ష్యంతో ముందుకెళ్లి మంచి ఫలితాలు సాధించాలన్నారు. తల్లిదండ్రుల కలను సాకారం చేయాలన్నారు. వైద్య కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ మాణిక్య రావు మాట్లాడుతూ.. విద్యార్థుల్లో ఆత్మనూన్యత భావం లేకుండా, ధైర్యంగా ముందుకెళ్లేందుకు ఇటువంటి మోటివేషనల్ తరగతులను ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. ప్రతి ఒక్కరూ వీటిని సద్వినియోగం చేసుకోవాలన్నారు.